నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 3 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విహంగ వీక్షణం

పక్షి ప్రేమికులను ఆకట్టుకున్న 'బర్డ్ వాక్ ఫెస్టివల్'

రెడ్ అవదాత్ బర్డ్

ఎల్లో బెస్ట్, గోల్డెన్ ఒరియల్

వైట్ గుడ్లగూబ

బొక్కివాగు ప్రాజెక్ట్ వద్ద కెమెరాతో పక్షులను బంధిస్తున్న పక్షి ప్రేమికులు

పెంచికల్ పేట్, ఫిబ్రవరి 2 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని అటవీ ప్రాంతంలో నిర్వహించిన 'బర్డ్‌వాక్ ఫెస్టివల్' పక్షి ప్రేమికులను ఆకట్టుకున్నది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బర్డ్ వాక్ ఫెస్టివల్, నేచర్ ట్రైల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకోసం 50 మంది పర్యాటకులు వివిధ జిల్లాల నుంచి శనివారం సాయంత్రమే పెంచికల్ పేట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రాత్రి గుండేపల్లి అటవీ శాఖ బేస్ క్యాంప్‌నకు చేరుకున్నారు. వైట్ ఫైర్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం బర్డ్ వాక్ ఫెస్టివల్‌ను స్థానిక ఎఫ్‌డీవో బొబడే సుశాంత్ సుఖ్‌దేవ్ ప్రారంభించారు. ఎల్లూరులోని బొక్కివాగు ప్రాజెక్ట్ వద్ద విహరిస్తున్న పక్షుల అందాలను పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించారు. అనంతరం అక్కడి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలరాపు గుట్ట వద్దకు రాబందులను చూసేందుకు సఫారీ వాహనాల్లో వెళ్లారు.

50 రకాల పక్షుల గుర్తింపు..

ఐదు రకాల విదేశీ పక్షులతో పాటు 40 రకాల వలస పక్షులు, మరికొన్ని పక్షులను గుర్తించారు. ఇందులో బార్ హెడ్డెడ్ గూస్, గ్రీలాగ్ గూస్, రెడ్ క్రెస్టెడ్ పోచర్డ్, గాడ్ వాల్ డక్స్, నార్తర్న్ షావ్లర్స్, బ్లాక్ డ్రాగన్గో, యురేషాన్ స్పూన్ బిల్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, కామన్ హూప్, రివర్ టర్న్, గ్రే హార్న్ బిల్, నార్తర్న్ పిన్‌టెయిల్, స్పాట్ బిల్ డక్స్, బ్లాక్ వింజర్డ్ స్టిల్డ్, రెడ్ వాటర్ లాప్వింగ్, గ్రీన్ బీ ఈటర్, ఓపెన్ బిల్ స్టార్క్, తదితర పక్షులు అలరించాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ అడవుల్లోని వన్యప్రాణులు, పక్షులను చూడడం సంతోషంగా ఉందని పర్యాటకులు అన్నారు.



బ్రాహ్మిని డక్స్

కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్

తాండూర్, ఫిబ్రవరి 2 : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక, ఆర్థిక సంస్కరణల కొనసాగింపే ఈ బడ్జెట్ అని సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారామ్ ఆరోపించారు. తాండూరు మండలంలోని నర్సాపూర్‌లో ఆదివారం సీపీఎం, ఏఐకేఎంస్, ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యలో బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని విమర్శించారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ సంస్కరణలను చేపట్టక పోవడం వికసిత్ భారత్ బడ్జెట్ కాదు ఇది కార్పొరేట్ సంస్థల బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. బడ్జెట్ పునః పరిశీలించి పెట్రోల్, డీజిల్‌పై పన్నులు రద్దు చేయాలని, అను ఇంధన సంస్థలను ప్రైవేటీకరించవద్దని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కేంద్ర పథకాలకు నిధులు పెంచాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్ లో నిధులు పెంచాలని, విభజన హామీల అమలుకు బడ్జెట్ కేటాయించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం బీహార్‌కు వరాలు తెలంగాణకు మొండి చేయి చూపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: నర్సాపూర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బడ్జెట్‌పై నిరసనల హోరు

ఉమ్మడి జిల్లాకు మొండిచేయి చూపడంపై ఆందోళన

- కేంద్రమంత్రులు హామీలు మరిచారని మండిపాటు
- ఎన్నికల హామీలు ఏమయ్యాయని చర్చ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించకపోవడంతో ఎదురుచూపులే మిగులుతున్నాయి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని అభివృద్ధి పనుల ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు మరోసారి నిరాశకు గురయ్యారు. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆర్నూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం, సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం, హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్, గిరిజన యూనివర్శిటీ, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు వంటి విషయాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. వీటికి నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉండగా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదకొండేళ్లుగా వీటిని బడ్జెట్‌లో గుర్తించకపోవడం జిల్లావాసులను అసహనానికి గురి చేస్తున్నది. జిల్లాలోని ప్రాజెక్టుల విషయంలో ముందడుగు వేయకపోవడంతో జిల్లా అభివృద్ధిపై బీజేపీకి చిత్తశుద్ధి లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వనరులున్నా నిర్లక్ష్యం

బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను తిరిగి ప్రారంభించడానికి అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయి. సీసీఐలోని 700లకు పైగా ఎకరాల స్థలంలో లైమ్‌స్టోన్‌తోపాటు ఇతర ముడిసరుకు, నీటి సౌకర్యంతోపాటు జాతీయ రహదారి ఉంది. ప్రస్తుతం ఆదిలాబాద్‌కు చెందిన వ్యాపారులు దూరప్రాంతాల నుంచి సిమెంట్‌ను కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. దీంతో వినియోగదారులు ధర ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. సిమెంటు పరిశ్రమ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడనాడి పరిశ్రమ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

- యానిస్ అక్బా నీ, ఆదిలాబాద్

రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలి

జిల్లా ప్రజలు ఎన్నో రోజులుగా ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ కోసం ఎదురు చూస్తున్నారు. రైలుమార్గం ద్వారా హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు పోయే అవకాశం ఉంటుంది. వ్యాపారులకు రైలు సౌకర్యం ఉపయోగకరంగా ఉంటుంది. ప్రయాణభారం తగ్గడంతో పాటు సరుకుల రవాణ సులభంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఈ రైలు మార్గం ఏర్పాటు కోసం బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరం. ప్రజల అవసరాలను గుర్తించి రైలుసౌకర్యం కల్పించాలి.

- గండ్రత్ సంతోష్, ప్రధాన కార్యదర్శి, చాంబర్ ఆఫ్ కామర్స్, ఆదిలాబాద్

ఎన్నికల హామీలు ఏమయ్యాయి

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థులు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయనే విమర్శ లు వస్తున్నాయి. గతంలో బీజేపీ కేంద్ర మంత్రులు సిమెంటు పరిశ్రమ విషయంలో సానుకూలంగా స్పందించారు. సీసీఐని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్వ యాన కేంద్ర మంత్రులు ప్రకటించిన సిమెంటు పరిశ్రమకు మోక్షం లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అభివృ ద్ధి పనులు ప్రారంభమైతే జిల్లా వాసులకు ప్రయోజనం చేకూరుతుంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి ల భిస్తుంది. వీటితోపాటు ప్రజలకు మెరుగైన రవాణ సౌకర్యం, వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు మెరుగుపడుతాయి.

ఆదిలాబాద్ జిల్లాపై కేంద్రం చిన్నచూపు

ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అవసరమైన వనరులు ఉన్నాయి. సిమెంట్ వినియోగం పెరుగుతుండడంతో డిమాండ్ బాగా ఉంది. వేలాది మందికి ఉపాధి కల్పించే సీసీఐని ప్రారంభించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేసినా ఫలితం లేదు. రైల్వేలైన్, విమానాశ్రయం విషయంలో కేంద్రం స్పందించడం లేదు. ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీతోపాటు నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలున్నా బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోవడం శోచనీయం.

- నారాయణ, ఆదిలాబాద్

నిధులు లేక నిలిచిన పనులు

సర్కారు బడుల్లో అసంపూర్తి భవనాల మధ్య విద్యార్థుల చదువులు

- 'మన ఊరు-మన బడి' పూర్తి కాకుండానే అమ్మ ఆదర్శ' పనులు !
- బిల్లుల కోసం ఏడాదిగా గుత్తేదారులు, పాఠశాల కమిటీ సభ్యుల ఎదురుచూపులు.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పించి నిరుపేద బిడ్డలకు ఆంగ్ల విద్యనందించే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు నిలిచిపోగా, ఆ తర్వాత కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. ఫలితంగా అసంపూర్తి భవనాల మధ్య విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. మరికొన్ని చోట్ల పనులు పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు, పాఠశాల కమిటీ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన పనులను పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులు చేపడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- దండేపల్లి, ఫిబ్రవరి 2

అసంపూర్తిగా తాళ్లపేట ప్రైమరీ స్కూల్ భవనం

మంచిర్యాల జిల్లాలో 710 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 'మన ఊరు-మన బడి' కింద 248 పాఠశాలలను ఎంపిక చేసి పనులు మొదలుపెట్టారు. విద్యార్థులకు తాగునీరు, డ్యూయల్ డెస్క్, బెంచీలు, తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు (ఆకు పచ్చ రాత బోర్డులు), ప్రతి తరగతి గదిలో విద్యుత్ ఆధునీకరణ పనులు చేపట్టారు. తరగతి గదుల్లో విద్యుత్ దీపాలతో పాటు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం కల్పించి, చేతులు శుభ్రపరుచుకోడానికి వాష్ బేసిన్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల పైకప్పులకు మరమ్మతులు చేశారు. పాఠశాల భవనాలతో పాటు, ప్రహరీకి రంగులు వేశారు. రూ.30 లక్షల లోపు పనులను పాఠశాల యాజమాన్య కమిటీలు పూర్తి చేయగా రూ.30 లక్షల కంటే ఎక్కువ నిధులు అవసరమయ్యే పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించారు. చాలా చోట్ల 60-70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులకు బకాయిలు రాక నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈజీఎస్ కింద చేపట్టాల్సిన శౌచాలయాలు, ఇంకుడుగుంత, మైదానం చదును, ప్రహరీ పనులపై గుత్తేదారులు అంతగా ఆసక్తి చూపలేదు. పలు చోట్ల అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. ప్రతి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి కాగా, మిగతా పాఠశాలల్లో 60-70 శాతం వరకే చేపట్టి నిలిపివేశారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 'మన ఊరు- మన బడి' స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులు పూర్తి చేయకుండానే అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద కొత్త పాఠశాలలను ఎంపిక చేశారు. 'మన ఊరు-మన బడి' పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు విన్నవించినా సర్కారు పట్టించుకోకపోవడం గమనార్హం. నిధుల మంజూరు, బిల్లుల చెల్లింపు విషయమై గతేడాది నుంచి జిల్లా విద్యాశాఖాధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి అసంపూర్తి భవనాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే విద్యార్థుల ఇబ్బందులు తీరుతాయని గ్రామస్తులు అంటున్నారు.

పనులు పూర్తయినా అందని బిల్లులు..

దండేపల్లి మండలంలోని మామిడిపెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి పథకం ద్వారా రూ.52 లక్షలు మంజూరయ్యాయి. పనులు పూర్తి చేసి కొని తెలంగాణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ విద్యా దినోత్సవం రోజున (20 జూన్ 2023)న అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థులకు డైనింగ్ హాల్, తాగునీరు, డ్యూయల్ డెస్క్, బెంచీలు, తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు(ఆకు పచ్చ రాత బోర్డులు), ప్రతి తరగతి గదిలో విద్యుత్ ఆధునీకరణ, స్మార్ట్ క్లాసులు, మేజర్, మైనర్ రిపేర్, తదితర పనులు చేపట్టారు. తరగతి గదుల్లో విద్యుత్ దీపాలతో పాటు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం కల్పించి, చేతులు శుభ్రం చేసుకోడానికి వాష్ బేసిన్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల పైకప్పులకు మరమ్మతులు చేశారు. పాఠశాల భవనాలతో పాటు, ప్రహరీకి రంగులు వేశారు. రూ.3.50లక్షల ఎన్ ఆర్ఈజీఎస్ నిధులతో పాఠశాలలో కిచెన్ షెడ్డు నిర్మించారు. బాలబాలికలకు వేర్వేరుగా మూత్రశాలలు నిర్మించారు. అన్ని బాగానే ఉన్నా పనులు చేసిన అప్పటి స్కూల్ కమిటీ సభ్యులకు ఇంకా రూ. 8.50లక్షల బకాయిలు ఉండడం గమనార్హం. పెద్దపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలది అదే పరిస్థితి. 2023 మార్చి 31న రూ.20 లక్షలతో పనులు పూర్తి చేసి అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు పూర్తయినా బిల్లులు రూ.5.60 లక్షలు పెండింగ్ లోనే ఉన్నాయి. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో చాలా చోట్ల పనులు పూర్తి చేసిన వారిలో స్కూల్ కమిటీ సభ్యులే ఉన్నారు. అప్పులు చేసి పనులు మొదలు పెట్టామని తీరా ప్రభుత్వం మారిపోయాక బిల్లులు ఆపేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని అప్పటి స్కూల్ కమిటీ సభ్యులు, గుత్తేదారులు కోరుతున్నారు.

అసంపూర్తిగా దండేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల భవనం

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నస్పూర్, ఫిబ్రవరి 2 : నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్, వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల కోసం 23 సెంటర్లకు గాను 10 ప్రభుత్వ, 8 ప్రైవేట్ కాలేజీలు, 5 సెక్టార్ కాలేజీలను ఏర్పాటు చేశారు. మంచిర్యాల డీఐఈవో అంజయ్య పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తూ అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం కాలేజీలకు రూ.10 వేలను ఇప్పటికే అందజేశారు. నేటి నుంచి ఈ నెల 22 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. జిల్లాలో సెకండియర్ విద్యార్థులు 3852 మంది, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1930 మంది హాజరు కానున్నారు.

పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఐఈవో అంజయ్య

వేంపల్లిలో వనదర్శిని

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2: కాగజ్‌నగర్ మండలంలోని వేంపల్లి అటవీ పరిధిలో ఆదివారం వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. అడవుల సంరక్షణపై కాగజ్‌నగర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పించారు. అడవుల ప్రయోజనం, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతౌల్యం, అటవీ చట్టాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో శశిధర్ బాబు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వనదర్శినిలో పాల్గొన్న విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు